# వెండి సీసా

నాలుగురోడ్ల మొగలో ఉంది మాఁవయ్య కొట్టు. సోడాలు, కిళ్లీలు, అరటిపళ్లు అమ్ముతాడు మాఁవయ్య. సోడామిషనూ, దాని వెనక ఎత్తుబల్ల, సిలిండరూ, లోపల గదిలో ఉన్నాయి. కొట్టు ఎడంపక్క అరుగు మీదుంది. కుడిపక్క అరుగులేదు; చూరునంటుకుని పందిరి - దానిమీద పొట్టి బెంచీలూ ఉన్నాయి. కొనుక్కోడాని కొచ్చినవాళ్ళే కాకండా మిల్లు ఫోర్మన్ రాములూ, క్లీనరు చెంచయ్య, పని లేనప్పుడొచ్చి అక్కడే కూచుంటారు గంటల తరబడి. అప్పుడప్పుడు బీడీలో, అరటిపళ్లో, సోడాలో కొంటుంటారు. వాళ్ళకి కాతాలున్నాయి. జీతాలిచ్చిన రోజున పట్టుకొచ్చి ఇచ్చేస్తారు, బకాయి మొత్తం. రోడ్డుమొగలో బస్సు ఆగినప్పుడు కండక్టర్ సుబాన్ వచ్చి బ్రాహ్మణ సోడా తాగుతుంటాడు. బ్రాహ్మణసోడా తయారు చెయ్యడం నాకు నేర్పాడు మాఁవయ్య. మోల్మేన్‌పెట్టె తాళం తీసి, అందులో పెద్ద మూతి గాజు సీసాలో గిద్ద ముంచి తియ్యాలి ద్రావకం. గిద్దకి పెద్ద కాడుంది. అందుకని ద్రావకంలో చెయ్యి ముంచక్కర్లేదు. తెల్లగా - అంటే - రంగు లేకండా నీళ్ళలాగుంటుంది ద్రావకం, ఆసుపత్రి వాసనకొడుతూ. ఒక్కొక్కగిద్ద, ఒక్కొక్క సోడాసీసాలో పొయ్యాలి. తరవాత సోడాసీసాల్లో నీళ్ళుపొయ్యాలి, గుండుకాస్త తగిలేదాకా. ఆ తరవాత సోడా మిషన్‌లో మామూలుగానే సీసాలు బిగించి తిప్పి, గాస్ వదలాలి. కొట్టులో కిందవరసలో పెట్టాలి వేరే ఈ బ్రాహ్మణ సోడాలు. రోజూ ఎన్ని ఖాళీ అయితే అన్నీ పూడుస్తుండాలి. కిందవరసలో పదమూడుంటాయి బ్రాహ్మణ సీసాలు. నాలుగో అయిదో ఖర్చవుతాయి. బ్రాహ్మణసోడా అర్వై పైసలు. పండగలూ, పబ్బాలు వొస్తే బాగా ఖర్చవుతాయి. పోయిన దీపావళినాడు ఒక్కరాత్రి నలభైమూడు ఖర్చయాయి.

మాఁవయ్య పేరు గోవిందన్‌కుట్టి. ఇరవై ఏళ్ళయిందట కేరళ దేశం వొదిలిపెట్టి. నాకు మళయాళం రాదు. మాఁవయ్య అప్పుడప్పుడు మలయాళం పాటలు పాడుతుంటాడు. అతను తెలుగు ఇప్పటికీ పట్టిపట్టి మాట్లాడుతాడు. ఇరవైఏళ్ళు ఈ దేశంలో ఉన్నా, నాకు తెలుగు తప్ప మరొకటి రాదు. నేనసలు అతని మేనల్లుణ్ణి కాదన్నాడు సుబాన్. ఒకరోజున బస్ చెడిపోతే, ఆరు బ్రాహ్మణ సోడాలు తాగేశాడు పందిరికింద కూర్చుని. బస్ రిపేరు పూర్తయి డ్రైవరువచ్చి పిలిస్తే, 'పోరా, తిరిగొచ్చీటప్పుడు వొస్తాలే' అన్నాడు. అలాంటప్పుడు అతన్ని బస్సులో ఎక్కిస్తే బాగుండదని డ్రైవర్ వెళ్ళిపోయాడు. రాత్రి తొమ్మిది గంటలకి బస్సు తిరిగొచ్చీదాకా బ్రాహ్మణ సోడాలు తాగుతూనే ఉన్నాడు. కొట్టు నామీద వొదిలేసి మాఁవయ్య కొత్తూరెళ్ళాడు. ద్రావకం, అరటిపళ్ళూ కొనుక్కు రావడానికి. అప్పుడన్నాడు సుబాన్. నేను మాఁవయ్యకి నిజంగా మేనల్లుణ్ణి కానని, ఎవరో కనిపారేస్తే నన్ను పెంచాట్ట. పెంటి - అంటె మా ఇల్లూడవడానికొస్తుంటుంది పనిమనిషి - నన్ను సాకిందిట చిన్నప్పుడు. పెంటికి నేనంటే ఎంతో ఇది. రాగానే నన్ను దగ్గరగా తీసుకుని

ఏడుస్తుంది. అంత ఇది. ఒకనాడు నన్ను తీసుకుపోతానంది, నాలుగు బ్రాహ్మణసోడాలు తాగి. మావయ్య గదమాయించి, పోలీసులకి అప్పజెప్పుతానని బెదిరించి పంపేశాడు. వెళ్ళేటప్పుడు నన్ను పట్టుకుని ఏడుస్తూ ఒకటే ముద్దులు. 'నా చిట్టి, నాకన్న, నా తండ్రి' అంటూ. పెంటి కొత్తూరుపాలెంలో ఉంటుంది, ఊరిచివర గుడిసెలో. స్కూలుకెళ్ళేటప్పుడు వొచ్చేటప్పుడూ చూస్తూంటా పెంటి గుడిసె. ఎప్పుడూ తలుపు మూసే ఉంటుంది. పొద్దున్నే ఆరింటికే లేచి మిల్లు తుడవడానికి వెడుతుంది. రోజల్లా జంక్షన్‌లోనే ఉంటుంది. సాయంత్రం కొట్టు మూసేశాక మాకొట్టుకొస్తుంది. ఇల్లూ కొట్టూ తుడిచేసి కొత్తూరు పాలెం పోతుంటుంది - కొత్తూరు పాలేనికి మా జంక్షను రెండు మైళ్ళు.

అయితే సుబాన్ కథమట్టుకు నేను నమ్మలేదు. నాకు మాఁవయ్య కాకపోతే నన్నెందుకు చదివిస్తున్నాడు?

ఒకరోజు మాఁవయ్యకి పెద్ద అన్యాయం జరిగిపోయింది. రోడ్డుకి అవతల మొగలో పెట్టాడు, పెద్దకొట్టు, కన్నయ్యనాయుడు. కన్నయ్య నాయుడు మిల్లు ప్రొప్రయిటరు కిష్టయ్యనాయుడు బావమరిది. అంటే కన్నయ్యనాయుడు చెల్లెల్ని కిష్టయ్యనాయుడు కిందటేడే లేవదీసుకొచ్చి, మిల్లు అవతల మామిడితోటలో బంగళాలో పెట్టాడు. కిష్టయ్య నాయుడు అసలు పెళ్లాం, ఇల్లూ కొత్తూరులో ఉన్నాయట. కొత్తూరు పది మైళ్ళుంటుంది. మా జంక్షనుకి. డొక్కు కార్లో వొస్తుంటాడు కిష్టయ్య మిల్లుకి. మిల్లుకన్నా పెద్ద చప్పుడు చేస్తుంది అతని కారు.

కన్నయ్యనాయుడు కొట్టు మిల్లు గోడౌన్ పక్కని కట్టుకున్నాడు. అది కట్టేటప్పుడు కొట్టుకని ఎవరూ అనుకోలేదు. కిష్టయ్య కారుకి షెడ్డనుకున్నారు. సుబాన్ అన్నాడు కూడా కిష్టయ్యకారుకి షెడ్డెందుకని - అది వానలో తడిసి, యెండలో ఎండకపోతే నడవదని కూడా అన్నాడు. దీపావళి ఓ వారం ఉందనగా వెలిసింది కొట్టు ఆ షెడ్‌లో. మాఁవయ్య ముందే కనిపెట్టినట్టున్నాడు కన్నయ్యనాయుడు తలపెట్టిన దుర్మార్గం. కొట్టు లేస్తున్నన్నాళ్ళూ, దానివంకే పరధ్యానంగా చూస్తూ మళయాళంలో ఏదో పాడుకుంటూ ఉండేవాడు. కొచ్చుణ్ణి పాటగావును. కొచ్చుణ్ణి కథ ఎన్నోసార్లు చెప్పాడు నాకు. కొట్టు తెరచిన రోజున, కిష్టయ్య పెంటినికూడా పిలిచి, బ్రాహ్మణసోడా యిచ్చాడు. మాఁవయ్యని మట్టుకు పిలువలేదు. మాఁవయ్య ముఖం మీద ముడతలు పెద్దవయాయి. అంటే మాఁవయ్య ఆలోచిస్తున్నాడన్నమాట.

కన్నయ్యనాయుడు కొట్టులో ఎలక్ట్రీ దీపాలుపెట్టాడు. రైస్‌మిల్‌లోంచి కరంటు తీసుకుని, కూలింగ్ మెషీన్ పెట్టాడు. బ్రాహ్మణసోడా కూలింగ్‌లో పెట్టింది డెబ్భై అయిదు పైసలు. అదిగాక రేడియో పెట్టాడు. కూర్చోడానికి ఇనుప కుర్చీలున్నాయి. గ్లాసులు పెట్టుకోవడానికి టేబిల్సున్నాయి. చిన్నవి. ఇవిగాక టీ కప్పుల్లో ఇస్తాడు. మాఁవయ్యలాగ గ్లాసుల్లో ఇవ్వడు. బన్‌లు, రొట్టెలు పెట్టడానికొకటి, చక్కలు, పాకంగారెలు, బూంది, పకోడీలు పెట్టుకోడానికొకటి అద్దాల ప్లేట్లున్నాయి. కనకయ్య నాయుడు కూర్చోడానికి ఒక ఎత్తుకుర్చీ టేబులూ ఉంది. టేబుల్ మీద గంటుంది. నొక్కితే మోగుతుంది. మోగితే కుర్రాడొస్తాడు. వొచ్చినవాళ్ళకి ఏం కావాలో కనుక్కుంటాడు.

నాలుగు రోజులు పోయాక కూలింగ్‌లో పెట్టిన బ్రాహ్మణ సోడా రూపాయి చేశాడు. అయినా రోజుకి నలభై ఏభై ఖర్చవుతున్నాయి. మాంవయ్య కొట్టుకి గిరాకీ తగ్గింది. మాంవయ్య ఆలోచనలో పడ్డాడు. అంటే అతని ముఖంమీద ముడతలు మరింత లోతయాయి.

త్రయోదశినాడు సాయంత్రం నేను స్కూలునించి తిరిగొచ్చేసరికి సుబాన్ బ్రాహ్మణ సోడా తాగుతున్నాడు. పెంటి ఇచ్చినట్టుంది. మామయ్య కొత్తూరెళ్ళాట్ట, పెంటికి కొట్టప్పగించి. మామయ్యకి కండక్టర్ పని అప్పగించి సుబాన్ కూడా ఆగిపోయాడు. నేను వచ్చేసరికి, పెంటి వెక్కివెక్కి ఏడుస్తోంది. సుబాన్ ఓదారుస్తున్నాడు. పుస్తకాలు లోపలపెట్టి సోడా మిషన్ వెనకాల ఎత్తుబల్లమీద కూర్చున్నాను. రోజూ నాలుగైదు సోడాలకన్నా ఖర్చవడం లేదు. ఈవారం రోజుల్నించీ, సోడామిషన్ రోజూ తిప్పవలసిన అవసరం లేకపోయింది. కొట్టుమీద అరటిపళ్ల గెల మాగిపోయింది కొనేవాళ్ళు లేక. జంక్షన్‌కి అవతల కన్నయ్యనాయుడు కొట్టు కలకల్లాడుతోంది. దీపాలతో, జనంతో. కిలకిల నవ్వులు అక్కడ. మాకొట్టుమీద దీపంకూడా వెలిగించలేదు పెంటి. పైగా ఏడుపు ఎగువులు.

'సుబానన్నోవ్, ఆ గుడిశేటి నా కొడుకు. కొట్టొదవమన్నాడు. నేను రానుపోరా నాయాలా అన్నా...” అంది పెంటి

'బద్మాష్! హాణ్ణి ముక్కల్ చేసినా పాపమ్ లేదు' అన్నాడు సుబాన్, మరొక బ్రాహ్మణ సోడా తాగుతూ.

'అప్పుడు కుర్రదాన్ని, దేవుల్లా ఆదుకున్నాడు కుట్టి. సొంతన్నగారిలాగా ఆదుకున్నాడు. రెండో కంటికి తెలీయకుండా... అప్పుడు నేనేం జేసేది? ఆరోనెల. పెళ్ళి జేసుకుంటానని మాటిచ్చాడు దొంగనాకొడుకు.'

'నువ్వెట్టా నమ్మావ్ పెంటిబహన్' అన్నాడు సుబాన్.

'ఏం జెప్పమంటా?... మిల్లొడిసి పోతన్నా. 'ఒసేపెంటీ ఆ మలయాలపోడి కొట్టుకుపోయి, అరడజను బాపన సోడాలట్టుకురా' అన్నాడో సాయంత్రం. సరేగందా అని పట్టుకెల్లా. ఆడి సెల్లిలింటికెళ్ళి మాంసం పకోటీ లట్రమన్నాడు తెచ్చా. నన్ను తినమన్నాడు – తిన్నా. ఓ సోడా యిచ్చి తాగమన్నాడు – బిడ్డ సాచ్చిగా సెబుతున్నా. బాపనసోడా యెట్టావుంటదో నాకప్పటికి తెలదు. అంటే కుట్టి నిన్నాళ్ల మట్టి యెరుగున్నా వొప్పుడూ సవిసూళ్ళె. ఓ గుక్క తాగేసరికి ఏటోలాగై పోనాది. సైతుగా, ఏటోలాగ. రొండుబుడ్లు తాగించాడు. ఒళ్లు సెమటలు – వుప్పెయ్యి అన్నాడు. రైక ఊడదీసా. ఆడు సీర వూడబెరికాడు. నా వొళ్ళు నాకే తెలదు. పెళ్ళి చేసుకుంటానన్నాడు. ఆడి సెల్లిలు తోడన్నాడు... ఒంటరి బతుకు ఎన్నాళ్లని?... మంచోడే అనుకున్నా... ఆ కొట్టెట్టిన్నాడు నిలదీసి అడిగా. “ఛీ. ఫో. నెంజా... ఎవుడే నిన్ను కట్టుకునీది? నా బోటోల్లు యెంతమందయారో నీకు” అన్నాడు. సీపురు మొగాన్నేసి కొట్టి వచ్చేశా.'

కళ్లూ మనసూ ఎదటి కొట్టుమీదున్నా, చెవి వింది ఇదంతా. లోపలంతా గింగురుమంది. కసిగా, అనుకోకుండా, సోడామిషన్ గిర్రుని తిప్పా. అప్పుడు

గుర్తుకొచ్చినట్టుంది పెంటికి. నే నింటో ఉన్నానని. గబగబా కళ్లు తుడుచుకుంది. పెట్రోమాక్స్ లైట్ వెలిగించింది. వేడెక్కకుండా కిరసనాయిలు ఒదిలినట్టుంది – కొంచెం ఉంటే పందిరి అంటుకునేదే. సుబాన్ గబుక్కుని కిరసనాయిలు మూసేశాడు – కొంచెం చెయ్యి కాలినా లెక్క చెయ్యలేదు.

మాఁవయ్య తిరిగొచ్చాక సుబాన్ బస్సెక్కి వెళ్ళిపోయాడు. పెంటి వెళ్ళిపోతానంటే మావయ్య ఉండమన్నాడు.

ముగ్గురం కలిసి తోరణాలు కట్టాం ఇంటిగుమ్మాలకి. రకరకాల బాణసంచాలు తెచ్చాడు మావయ్య. అవి చూస్తుంటే చేతులు గులపుట్టాయి. ఆ రాత్రి పెద్దసీసా బయటికి తీసి, అందులో ద్రావకమంతా సోడాబుడ్లలో సర్దేసి సోడామిషన్ పక్కని బల్లమీద పెట్టాడు మాఁవయ్య. నలభై బ్రాహ్మణ సోడాలు పట్టమన్నాడు నన్ను. రోజుకి రెండైనా ఖర్చుకాందే నలభై ఎందుకో నాకర్థం కాలేదు. అయినా మాఁవయ్యని అడగడం అలవాటులేదు నాకు. నేను సోడాలు పడుతుంటే, పెంటిని పొయ్యి అంటించమని, తను పెద్ద సీసా తీసుకొని దొడ్లోకి వెళ్ళాడు – బట్టల సబ్బు తీసుకుని నూతి దగ్గిరికి. పెంటి పొయ్యి అంటించి, పెద్ద పెనం పెట్టి నూనె పోసింది. మావయ్య తెల్లగా కడిగిన సీసాలో తెల్లగుడ్డ తిరెట్టి తడిలేకుండా తుడిచేశాడు. పెంటి పక్కని కూర్చున్నాడు. మావయ్య తెచ్చిన మాంసం బల్లచెక్కమీద పెట్టి చిన్న ముక్కలుగా తరిగి, పక్క పొయ్యిమీద ఉడకబెట్టాడు. పెంటిని శనగపిండి పెద్ద అల్యూమినం గిన్నెలో కలపమన్నాడు. ఉల్లిపాయలూ, పచ్చిమిరపకాయలూ మాంసం తరిగిన బల్లచెక్కమీద పెట్టి తరిగాడు. ఉడికిన మాంసం ముక్కలు, ఉల్లిపాయలూ, పచ్చిమిరపకాయలూ కలిపిన తొక్కూ కలిపి, పకోడీలు చేశారిద్దరూ. నలభై బ్రాహ్మణ సోడాలూ పట్టేసరికి నాకు కళ్లు కూరుకొచ్చాయి. కొట్టు బల్లచెక్కలు మూసేసి, గాసులైటు ఆర్పేసి, తలుపులు వేసేశాను. అది నా డ్యూటీ. కునికిపాట్లు పడుతుంటే, పెంటి లేచొచ్చి నా కన్నం పెట్టింది. ఎందుకో నన్ను ఒళ్లో కూచోబెట్టుకుంది ఆవేళ. పెంటి వొళ్ళు మెత్తగా పరుపులా ఉంది. అంత మెత్తదనం నేనెప్పుడూ జన్మలో ఎరగను. ఆఖరిముద్ద తినకుండానే ఆమె రొమ్ముమీద వొరిగి నిద్రపోయాను. నిద్రపోయినా నాకు తెలుసు, ఒరిగానని – పెంటే నన్ను పక్కమీద పడుకోబెట్టిందని. మావయ్య ముఖం, పెంటి ముఖం పొయ్యి మంట వెలుగులో రప్పుని ఎంతో అందంగా వెలిగాయి నా కలలో– చిచ్చుబుడ్లలాగా. పెంటి మంచి ఉత్సాహంగా ఉంది. బందరు తూటాలా తిరిగింది అటూ ఇటూ కలలో. మావయ్య ముఖంలో ఎంత వెలుగు.

చీకటి ఉండగానే లేపింది పెంటి. రాత్రి నా పక్కనే పడుకుందని అప్పుడు తెలిసింది. అల్లాగ పెంటి పక్కలో ఇంక లేవకండా పడుకోవాలనిపించింది. చొక్కా లాగూ విప్పమంది. సిగ్గన్నాను.

'నీ చీమ్మిరపకాయి ఎవురన్నా అట్టుకుపోతారనా? యిప్పేసే' అంటూ ఊడదీసింది బొందు. ఆ తరవాత సిగ్గుపోయింది. చెవుల్లోకి కారేటట్టుగా తలమీద నూనెట్టింది. పళ్లు తోముకున్నాక, దొడ్లో నూతిదగ్గర కూర్చోబెట్టి వెచ్చగా తలంటింది. అప్పుడు చూపించాడు మాఁవయ్య, తనుతెచ్చిన చొక్కా లాగూ. పెంటి తనే తొడుగుతానంది – తొడిగింది. నన్ను దగ్గరగా హత్తుకుని మాఁవయ్య కాళ్ళకి దణ్ణం పెట్టమంది.

'బుద్ధి, బుద్ధిగా బతుకు' అన్నాడు మాఁవయ్య.

'లగెత్తుకెళ్లి – పొలెంలో యెంకటేసు నడిగి ఓశేరు పాల్రట్రా' అంది పెంటి డబ్బులూ, దాకా ఇస్తూ. ఇది మామూలు పండగకాదని అప్పుడే అనుకున్నా.

తిరిగొచ్చాక తెలిసింది. ఇది మామూలు పండగ కాదని. పెంటి తెల్లని చీర కట్టుకుంది. కొత్తది. మామూలు చీరలాగ కాదు – ఏదో గూడకట్టులాంటి కట్టు. మళయాళీలు కట్టుకుంటారట అల్లాగ – అందులో కిరస్తానీ మళయాళీ ఆడాళ్ళు. తలకేదో తెల్లటి రుమాలు మడతెట్టి పిన్నులు గుచ్చాడు మాఁవయ్య. మాఁవయ్య తెల్ల కొత్త పంచి గూడకట్టు కట్టుకున్నాడు. నాకేమీ అర్థం కాలేదు. అసలు మావయ్య కిరస్తానీ అని నాకంతవరకూ తెలీదు. ఎప్పుడూ అతను చర్చికి వెళ్ళలేదు.

బస్సులో కొత్తూరు వెళ్లాం. ఊరు బయటుంది చర్చి. నేనెప్పుడూ చర్చిలోపలి కెళ్ళి చూడలేదు. శిలువమీద క్రీస్తు బొమ్ముంది ఒక పక్కని. మేరీ బుల్లి క్రీస్తుని ఎత్తుకున్న పటం బంగారప్పూత పూసింది ఇంకో పక్కనుంది. ఫాదరీ ప్రమాణం చేయించారు మామయ్యచేత, పెంటిచేత. పెంటి అసలుపేరు సుబ్బలక్ష్మిట – అప్పుడే తెలిసింది నాకు. పెంటికి మాఁవయ్యకి పెళ్ళైపోయింది. ఇవతలికొచ్చాక చర్చి ఆవరణలో అమాంతంగా మాఁవయ్య కాళ్ళమీద పడి ఒకటే ఏడుపు. ఎంతలేవమన్నా లేవలేదు. మాఁవయ్య కొత్త చెప్పులు తడిసిపోయాయి.

బస్సులో తిరిగొచ్చీటప్పుడు మాత్రం పెంటి ముఖం చిరునవ్వుతో వెలుగుతూనే ఉంది. కళ్ళలో తడి ఇంకా మెరుస్తూనే ఉంది.

జంక్షన్‌లో బస్సు ఆగ్గానే మాఁవయ్య దిగాడు. సుబాన్, కండక్టరు పని తనతో తీసుకొచ్చిన వెంకాయికి అప్పజెప్పి ఆగిపోయాడు. మాఁవయ్య తిన్నగా కన్నయ్య నాయుడు కొట్లోకెళ్ళాడు. వెటకారంగా చూశాడు కన్నయ్య నాయుడు.

"ఏంది గోయిందో – ఆ పెంటిముండని పెళ్ళాడావంట" అన్నాడు. అతనూ అతనితోబాటు సోడాలూ టీలూ తాగుతున్న జనం గొల్లుమన్నారు. పెంటి కళ్ళలో మంటలు రేగాయి. తిన్నగా వెళ్ళింది చరచరా బస్సు దగ్గర్నుంచి కన్నయ్య కొట్టు దగ్గిరికి. కన్నయ్యమీద ఉమ్మెయ్యబోతుంటే ఆపాడు మాఁవయ్య. మెత్తగా నవ్వాడు.

'నాయిడన్నాని, మంచిగా పిలవాలే' అన్నాడు.

పెంటి కోపమంతాపోయి ఏదో తెలియని వెలుగొచ్చింది ఆమె కళ్ళలోకి మాఁవయ్య కన్నయ్య దగ్గరగా వెళ్ళాడు పెంటిని చేయి పట్టుకుని నడిపించుకుంటూ. మాఁవయ్య పెంటీ అంత కులాసాగా అంత హాయిగా తన కొట్లో కొచ్చీసరికి తబ్బిబ్బైపోయాడు కన్నయ్య.

'పయ్యా–రండు టీ!' అని తనే ఆర్డరిచ్చాడు మాఁవయ్య. కన్నయ్యకి ఎదురుగా టేబిల్‌దగ్గర కూర్చున్నారు మాఁవయ్య పెంటి. టీ వచ్చీలోగా మాఁవయ్య అన్నాడు.

"అణ్ణా! కొట్టు బలేమంచిగా పెట్టారు మీరు. మన జంక్షన్‌కి గొప్పపేరు మీ కొట్టువల్ల. మొదలు కొంచెం మాకు కష్టం వేసింది. కాని సరిపుచ్చుకున్నాను. ఎవరి బతుకు వాండ్లు బతకాల. మీ వ్యాపారం మీది. మా వ్యాపారం మాది. మీతో పోటీ లేదు

మాకు. మీరు పెద్దవాండ్లు. ఈ దినం పెంటిని కల్యాణం చేసుకొంటిని. సాయంత్రం శిన్న పార్టీ ఇస్తును. మీరు తప్పక రావాల్ను. మా సంతోషంలో – ఏదో మీరుకూడా పాలుపంచుకోవాల్ను, మా పేదవిందు బోజనంచేసి, మాకు మంచి కలగాల్ని యేసు ప్రభువుకు చెప్పాల్ను."

మాఁవయ్య ఇరవైఏళ్లు వచ్చి తెలుగు గడ్డలో ఉన్నా, అతని మళయాళీయాస పోలేదని ఆశ్చర్యం వేసింది నాకు. తన్ని ఇంత పెద్దజేసి పిలిచినందుకు కన్నయ్య నాయుడికీ ఆశ్చర్యం వేసింది.

'అరే అల్లా' అన్నాడు సుబాన్.

సాయంత్రం విందుకి కిష్టయ్య నాయుడు కూడా వచ్చాడు. మావయ్య అతన్నీ పిలిచాడు. బియ్యం మర పనివాళ్ళు కొందరొచ్చారు. సుబాన్ కూడా ఉన్నాడు. పార్టీ మంచి హుషారుగా సాగింది. ఆరోజుని తిన్న మాంసం పకోడీలంత రుచిఅయినవి జన్మలో తినలేదన్నాడు కిష్టయ్య. రోజూచేసి మిల్లుకి పంపమన్నాడు – ఒక కిలో. కష్టాల్లో ఉన్న పెంటిని ఆదుకుని, ఆమెకొక ఇల్లు, గౌరవం కల్పించినందుకు 'యేడుకొండలసామి' చల్లగా చూస్తాడన్నాడు. కన్నయ్య నాయుడికి చాలా ఇబ్బందిగా ఉంది. అయితే తనకీ పెంటికీ సంబంధముందని, కిష్టయ్యకి తెలీదేమో అన్నాడు సుబాన్ పెంటితో రహస్యంగా. బ్రాహ్మణ సోడాలూ అందులోకి పకోడీలు నంజు. బ్రహ్మాండంగా ఆనందించారు వొచ్చిన జనం. సుబాన్ పెట్రోమేక్స్ వెలిగించాడు. అప్పుడు కుడిప్రక్క కిటికీ గుడ్డ లాగాడు మావయ్య. నాకు తెలీదు – కళ్ళప్పగించి చూశాను.

పెట్రోమేక్స్ వెలుగులో ద్రావకం సీసా తళతళ మెరుస్తోంది. అందులో పీకదాకా, వెండి పావలా కాసులున్నాయి. పైన బిరడా పెట్టి లక్కసీలు వేసివుంది. పెంటీ మాఁవయ్యా రాత్రి తయారు చేసుంటారు దీన్ని. మాఁవయ్య చిరునవ్వు నవ్వుతూ చెప్పాడు. క్రిస్టమస్ పండగ రెండు నెల్లుంది, తన కొట్టులో పావలా సరుకు కొన్న ప్రతి మనిషీ ఆ సీసాలో ఎంత సొమ్ముందో అంచనావేసి చెప్పొచ్చు. జేబులోంచి ఒక పుస్తకం తీశాడు. రూళ్ళ పుస్తకం. ఎవరెవరు ఎంత మొత్తం చెప్పారో అందులో నాచేత రాయిస్తానన్నాడు తనకి తెలుగు రాయిడం రాదుగనక. క్రిస్టమస్ పండగ నాడు అందరియెదటా ఆ సీసా సీలుతీసి లెక్కపెడతాడు – సీసాలో సొమ్ము. సరిగ్గా సొమ్మెంతో చెప్పినవాళ్ళకి సీసాతోసహా అది ఇచ్చేస్తానన్నాడు. 'బలే' అన్నాడు సుబాన్. 'దేవాంతకుడు' అన్నాడు కిష్టయ్యా – 'ఇప్పుడే రాసుకో – మూడొందలయాభై అన్నాడు ఫోర్మన్ రాములు. 'ఏదన్నా కొంటేగాని మీరు చెప్పేదానికి లేదు' అన్నాడు మావయ్య. పావలా ఇవ్వబోయాడు రాములు. 'ఈదినం అమ్మేదిలేదు. రేపు' అన్నాడు మావయ్య.

మర్నాడు దీపావళి. నూట యాభై రూపాయలమ్మింది మా కొట్టులో. టీ తాగే జనంకూడా మా కొట్టులోకి వొచ్చేశారు – రూళ్ళ పుస్తకం సగం నిండిపోయింది. కన్నయ్య నాయుడు ముఖం మాడిపోయింది.

పెంటి కొట్టు పెద్దది చేద్దామంది. ససేమిరా వొద్దన్నాడు మాఁవయ్య. దురాశ దుఃఖానికి చేటన్నాడు.

దీపావళినాడు నాతోబాటు పెంటికూడా కాల్చింది బాణసంచా. ఆరోజు మధ్యాహ్నం కొట్టు మూసేశాడు మాంవయ్య. చాలామంది పావలాలు తెచ్చుకున్నవాళ్ళు దిగాలుపడి వెళ్ళిపోయారు. కన్నయ్య నాయుడు కొట్టువంకన్నా చూడలేదు వాళ్ళు.

'బలే దెబ్బకొట్టాడు – ఎట్టాగైనా మళయాళీ బుఱ్ఱ' అన్నాడు రాములు. వాళ్ళకీ కన్నయ్యను చూస్తే కోపం.

నేను బడి మానేశా. పావలా పద్దులు రాయటానికే టైము చాలడం లేదు. పెంటికి చదువురాదు. ఏమైనాసరే కొట్టు పెంచడానికి మాత్రం మాంవయ్య ఒప్పుకోలేదు. రోజుకోవంద అమ్మితే చాలు. పేదవాళ్ళని ఆశపెట్టి ఉన్న పావలా దీనికోసం ఖర్చుపెట్టిస్తే వాళ్ళింటికి పోయి ఏం తింటారు? నాలుగురోజులు పోయాక మాంవయ్యనీ కొట్టునీ తిట్టుకుంటారు. అంచేత మాంవయ్య పదేళ్ళలోపు పిల్లల దగ్గిర పావలాలు పుచ్చుకునేవాడు కాదు. పెద్దలెవరన్నా కూడా ఉంటేనే తీసుకునేవాడు.

నాలుగురోజులు పోయాక, కన్నయ్య నాయుడు పెద్ద గాజుజాడీ తీసుకొచ్చాడు. దానినిండా నయాపైసలు నింపాడు. మాంవయ్యలాగే పెట్టాడు పందెం. పదిపైసల సరుకుకొంటే పేరు రాసుకుంటానన్నాడు. మొదటి రెండు మూడు రోజులు కొందరటుపోయారు గాని, క్రమంగా దానికి 'రాగీ సీసా' అన్నపేరు ప్రచారంలోకి రావడంతోటే, మాంవయ్యది 'వెండిసీసా' అయిపోయింది. గిద్దిదు వెండికీ తట్టెడురాగికీ సరి అన్నారు జనం. కన్నయ్యనాయుడు వీధిని పడితిట్టడం మొదలుపెట్టాడు. ఎక్కణ్ణించో వచ్చాడీ మళయాళీ నక్క. అయిదువేలు తన బావగారి దగ్గర అప్పుతెచ్చి కొట్టుపెడితే, తన్ని నాశనం చెయ్యడానికి ఈ ఎత్తువేశాడు – తెలుగు గడ్డ మీద అట్లాంటి దుర్మార్గుల్ని ఉండనియ్యకూడదు. తెలుగోడెవడన్నా ఇట్టాంటి నీచప్పని కెగబడతాడా? ఎదటపడి బరిమీద దెబ్బలాడతాడు. ఇట్లా సాటుగా దొంగదెబ్బలు తియ్యటం దక్షిణాదోళ్ళే – ఆళ్లని తరిమెయ్యాలి...

మావయ్య తృప్తిగా చిరునవ్వు నవ్వుకుంటూ కొట్టుమీద కూర్చునీవాడు. కన్నయ్య మాటలకి దేనికీ సమాధానం చెప్పేవాడు కాదు. పెంటి మాత్రం గర్వంగా నీ లెక్కెంత అన్నట్టు చూసింది కన్నయ్య వేపు. పెంటి ఇప్పుడు మహ అందంగా ఉంది.

కన్నయ్య సోడామిషను అమ్మేసి సబ్బులూ పౌడర్లూ కొన్నాడు. ఏవన్నా అమ్ముతాయేమోనని. కిష్టయ్య నాయుడు తప్ప. ఇంకెవరు కొంటారని ఆ జంక్షన్‌లో? మాంవయ్యోరోజున ఐదు రూపాయలిచ్చి పంపించాడు పెంటిని చిన్న సెంటుబుడ్డీ, పౌడరుడబ్బా, సబ్బూ తెచ్చుకోమని. మామయ్య నిజంగా జాలిదలిచే పంపించాడు. పాపం అంత పెద్దదుకాణం పెట్టుకుని బొత్తిగా అమ్మకం లేకుండాపోయింది నాయుడికని. మామయ్యకి అసలు ఎవరితోటీ విరోధముంటే తోచదు. పదిమందితోటీ కలిసికట్టుగా ఉండాలని అతని కోరిక. అయితే పెంటిని పంపడం పొరబాటేమో.

పెంటి తన ఏడునెల్ల కడుపూ కన్నయ్య నాయుడి యెదట గొప్పగా ప్రదర్శిస్తూ అసలు మళయాళీ ఫక్కీలో చీరబిగించి, తల గర్వంగా వెనక్కి విసిరి వెళ్ళిందేమో కన్నయ్య భరించలేకపోయాడు. అందులో ఆ కడుపుకి కారణం తను. అది చెప్పు తీసుకు కొట్టినట్టు

తన మీదికే పంపించాడు మావయ్యనుకున్నాడో ఏమో. ఐదు రూపాయలు బల్లమీద నిర్లక్ష్యంగా కొట్టి, గులాబీ అత్తరు, లక్ససబ్బు – పాండ్స్ పౌడరూ అంది పెంటి. చంద్రుని చేత్తో ఐదురూపాయలూ పక్కకి తోసేసి, 'పోముండా! మళయాళీ...' అన్నాడు కన్నయ్య. 'నోరు పారేసుకున్నావంటే... అంది పెంటి. మాఁవయ్య పరుగెత్తుకెళ్ళి, పెంటిని వెనక్కి తీసుకొచ్చాడు. ఇవతల పడ్డ అయిదు రూపాయలూ నేను తీశా. కళ్ళ కద్దుకున్నా. కన్నయ్య నోటికొచ్చినట్టలా తిడుతున్నాడు. పెంటి వెనక్కి తిరిగి, 'కుక్కా! చిత్తకార్తి కుక్కా... థూ' అని ఉమ్మేసింది. మాఁవయ్య సముదాయిస్తూ పెంటిని ఇంటికి తీసుకొచ్చేశాడు.

ఆ తరవాత జంక్షన్‌లో మధ్య పచ్చగడ్డివేస్తే, ఒకపక్క కన్నయ్య, రెండోపక్క పెంటి – భగ్గుమంటుంది. అయితే జంక్షన్‌లో జనానికి మాఁవయ్య మంచితనం తెలుసు.

నాలుగు రోజులుగా ప్రతిరోజూ వచ్చి, కిటికీ కింద నిలబడి చూస్తున్నాడు వెండిసీసా వంక బూతప్ప. నాయిుడువాడే.

"ఏఁవిటల్లా చూస్తున్నావ'న్నాను.

'నెక్కేస్తన్నా' అన్నాడు బూతప్ప.

ఆ తరవాత క్రమంగా తెలిసింది. సీసావంక చూస్తూనే మాట్లాడేవాడు. మాలాడు. తల్లీ తండ్రీ ఉన్నారు – ఎక్కడో మాత్రం చెప్పలేదు. మేం వాళ్ళకి చెబుతామని కాబోలు. యాసనిబట్టి అనంతపురం ఫక్కీ అనుకున్నాం. తండ్రి గొడ్లు కాయమన్నాడు. తనకి చదువుకోవాలనివుంది. పారిపోయి వచ్చేశాడు. కొత్తూరులో స్కూల్లో కెళ్ళి చేర్చుకోమన్నాడు. తను మాలనని చెప్పాడు. మీ అయ్యా అమ్మా ఎవరో కూడా రాందే చేర్చుకోనన్నాడు హెడ్‌మాస్టరు. తరవాత నవభారత్ కేఫ్‌లో కప్పులు కడిగే పనిలో చేరాడు. ఓనాడు ఆ హెడ్‌మాస్టరు కాఫీ తాగడానికొచ్చి, బూతప్పనిచూసి ఛీ మాలాడు కడిగిన కప్పుల్లో కాఫీ ఇస్తావా నాకు? అని 'పొప్పురైటర్'తో దెబ్బలాడి వెళ్ళిపోయాడు. పొప్పురైటర్ వీపు చిట్లేసి పొమ్మన్నాడు. నిన్ననే రైసుమిల్లులో చేరాడు తుడవడానికి. ముందే చెప్పేశాడు మాలోల్లని. తరవాత తెలిస్తే నాయుడుగారు చెమడా లెక్కదీస్తాడు.

'ఈ సీసా సంగతిన్నా. ఓపావులాయేసి సీసా కొట్టేస్తా. ఆ సొమ్మట్టుకోని పట్నం బోయానంటే యమ్మేదాకా చదవొచ్చు' అన్నాడు.

'యమ్మే' ఎక్కడో విన్నాడు అదేఁవిటో నాకూ తెలియలేదు.

'నీదగ్గరుచ్చుకోదు మాఁవయ్య. పెద్దోళ్ళెవరైనా కూడా ఉండాలి' అన్నాన్నేను.

బూతప్ప మాట్టాడలేదు – అట్లాగే చూస్తూ నిలబడ్డాడు – వెండి సీసావంక, ఎలా లెక్కపెడతాడో నాకేఁవీ అంతుపట్టలేదు.

రోజూ వొచ్చి కిటికీకింద మాత్రం నిలబడేవాడు, వెండిసీసా వంక రెప్పవాల్చకుండా చూస్తూ.

ఓరోజున కన్నయ్య నాయుడు బాగా చిత్తుగా తాగేసి వొచ్చాడు మాకొట్టుకి. పెంటి రాక్షసిలా అతనిమీద పడబోయింది. మాఁవయ్య చెయ్యిపట్టుకొని అవతలికి తీసుకుపోయాడు. నేను బడ్డీకింద దాక్కున్నా, నాయుడు ఏం చేస్తాడోనని. బూతప్ప మాత్రం అట్లాగే నిశ్చలంగా చూస్తున్నాడు వెండిసీసావంక. అతని వెనకొచ్చి నిలబడ్డాడు కన్నయ్య నాయుడు.

'సొమ్ము కావాలా?' అన్నాడు నాయుడు.

'నెక్కేస్తన్నా' అన్నాడు బూతప్ప.

పగలపడి నవ్వాడు నాయుడు. పందిరి అదరిపోయిటట్టు. ఇంతలో మావయ్యొచ్చాడు.

'ఒరే మళయాళీ కుక్కా ఓ బాపనసోడా యియ్యి – ఈ కుర్రాడు లెక్కేత్తన్నాడంట, ఆడిపేరు రాసుకో' – అన్నాడు.

మావయ్య మొహంమీది చిరునవ్వులో ఎంతో బాధున్నట్టు అనిపించింది. బడ్డీ కిందినించివొచ్చి, మావయ్యకి బ్రాహ్మణ సోడా అందించా. ఒక్క గుక్కలో తాగేసి, రూపాయి కాగితం ఉమ్మేసినట్టు మావయ్య మీద విసిరేసి వెళ్ళిపోయాడు.

'తంబీ, నీ పేరు' అన్నాడు మావయ్య.

'ఇప్పుడొద్దు. ఆరిసొమ్ముతో నాకెందుకు? నేనే సంపాదిత్తన్నా బాబాయి. పెద్దోళ్ళు లేందే, పిల్లల దగ్గర సొమ్ముచ్చుకోవంటగా. నాయుడుగారు నా తరపున సొమ్మిచ్చి రాసుకోమన్నారుగా. పదిరోజుల్లో – నా సొంత సొమ్ము తెచ్చుకుంటా, అప్పుడు చెపుతా సొమ్మెంతో – యేం?' అన్నాడు బూతప్ప.

మావయ్య చాలాసేపు బూతప్పవేపు చూశాడు. బూతప్ప బతిమాలుతూ చూశాడు. మావయ్య అప్పుడప్పుడు చల్లగా వెన్నలాగ కమ్మగా నవ్వుతాడు. ఇప్పుడల్లా నవ్వాడు. 'ఈ సొమ్ముతో పట్టంబోయి చదువుకుంటావా?' అన్నాడు.

'ఎవరు చెప్పారు?' అన్నాడు బూతప్ప

'ఇజ్ఞ్యాను' అన్నాడు మావయ్య.

రేపు క్రిస్టమస్ అనగా పురుడొచ్చింది పెంటికి. ఆడపిల్ల బొద్దుగా, నల్లగా, పెంటిలాగే ఉంది ముద్దొస్తూ.

క్రిస్టమస్ రోజు రాత్రి మళ్లీ విందు చేశాడు మావయ్య. ఆడబిడ్డ మా లక్ష్మి అంది పెంటి. అదీగాక ఆ రాత్రి వెండిసీసాలో సొమ్ము లెక్క. సాయంత్రం చేరారు ఒక ఇరవైమంది. కన్నయ్యనాయుడూ వచ్చాడు. బ్రాహ్మణ సోడాలూ, మాంసం పకోడీలతో ప్రారంభమైంది విందు. ఎనిమిదింటికి పరుగెత్తుకుంటూ వచ్చాడు బూతప్ప.

'టైమైపోయిందా?' అన్నాడు.

'లేదు, పదింటిదాకా ఉంది' అన్నాడు మావయ్య.

పావలా ఇచ్చి ఒక గుక్కలో అన్నాడు బూతప్ప. 'రెండొందల పదిహైదు డెబ్బయిఅయిదు పైసలు.'

నేను పుస్తకంలో రాశా. కన్నయ్య నవ్వాడు – నవ్వి దగ్గాడు. అప్పటికే పెద్దవాళ్ళంతా కాస్త జోరులోనే ఉన్నారు. రెండు పెద్ద ద్రావకం సీసాలు అప్పుడే కాళీ అయిపోయాయి. మావయ్య కూడా ఆ రోజుని కాస్త సోడా రుచిచూశాడు కన్నయ్య బలవంతంమీద. అదివరకెప్పుడూ అమ్మడమేగాని, బ్రాహ్మణసోడా మావయ్య చవిచూడ్డం నేను చూడలేదు.

ఇంతలో 'వెండిసీసా ఎవరు నెగ్గుతారన్న' విషయమై పోటీ లొచ్చాయి. పందా లొడ్డారు. పైపందాలు, చాలా సరదాగా. ఖులాసాగా సాగుతోంది పోటీ. అసలు సుబాన్ లేవదీశాడీ పోటీ – బూతప్పని అడిగాడు.

'సొమ్మెల్లా చెప్పావు? ఎల్లా లెక్కెట్టావు?' అని.

'నా రేక మంచిదంట. అమ్మోరొచ్చి కల్లో చెప్పుద్దంట. మా వూరి బుగత చెప్పాడు. మాయమ్మంటుండేది. పదకొండో పుట్టి(న్రో)జునాడు లచ్చిమొచ్చి పడద్దంట.'

'కల్లో వొచ్చి చెప్పిందా అమ్మోరు?'

'ఎవరో జెప్పారు అమ్మోరో, అయ్యోరో' అన్నాడు బూతప్ప. అతని చిరునవ్వు చిత్రంగా కనబడింది.

ఈలోగా పైపందాలు ఏభై దాటిపోయాయి.

మిల్లులో గడియారం పదికొట్టిందన్నాడు ఫోర్మన్ రాములు. మాంవయ్య వెండిసీసా ఇవతలకి తెచ్చాడు. అందరి ఎదటా సీలూడదీశాడు. పందిరికింద టేబిల్‌మీద పోశాడు. తెల్లని పావలా కాసులు. నాలుగేసి చొప్పున పోగులెట్టాం నేనూ మాంవయ్యా. రాములూ, సుబానూ జనం ముందికి రాకండా ఆపారు. లెక్క పూర్తయింది.

పావలాకాసులు మొత్తం రెండువందల పదిహేను రూపాయలు డెబ్బయిఅయిదు పైసలు.

బూతప్పకి ఏడుపూ నవ్వూ, చెమటా ఒక్కసారే పుట్టాయి. అంతా విస్తుపోయి చూస్తున్నారు. తాగిన ముఖాలు పెట్రోమేక్స్ వెలుగులో పిచ్చిగా కనిపించాయి. మాంవయ్య పావలా కాసులన్నీ సీసాలో పోశాడు. అప్పుడు దేవుళ్ళా కనిపించాడు మాంవయ్య. బూతప్ప అమాంతంగా వొచ్చి మాంవయ్య కాళ్ళమీద పడ్డాడు. మాంవయ్య మెల్లగా లేవదీసి దగ్గరగా తీసుకున్నాడు.

'జ్ఞాను చదువుకోలేదు. నువ్వన్నా బుద్ధిగా చదువుకో' అన్నాడు.

వెండిసీసా బూతప్ప చేతులో పెట్టాడు. పెంటి ఇవతలికొచ్చింది. చంటిబిడ్డ నెత్తుకున్న మేరీ పటం గుర్తుకొచ్చింది ఆమెను చూస్తుంటే. చంటిబిడ్డని హత్తుకున్నట్టే వెండిసీసా గుండెలకు హత్తుకుని బూతప్ప పెంటికాళ్ళకి దండం పెట్టాడు. అప్పుడరిచాడు కన్నయ్య - అతని కళ్ళలో తాగిన పిచ్చి - కసి, ఈసు, కోపం, ఆవేశం చూసి హడలిపోయాను - బడ్డీకింద దూరాను.

"ఈడే చెప్పాడా కుర్రోడికి -ఈడే-ఈమళయాళం గాడిద కొడుకు" తాగిన ముఖాలు ఓ పాతిక మూర్ఖంగా నిందారోపణ జేస్తూ చూశాయి మాంవయ్య వంక. మాంవయ్యన్నాడు తాపీగా-

"ఇది జ్ఞా సొమ్ము. కావాలంటే ఉట్టినే ఆ తంబికి ఇవ్వగలను."

"మోసం, ఆడూ మలయాళీవోడే - మనందరి దగ్గరా పావులా పావులా దొబ్బి అదంతా ఆళ్ళోడికి దొబ్బబెట్టాడు" అన్నాడు కన్నయ్య.

'జ్ఞానేం లాతిరీ పెట్టానా? పావలాకి సరుకులివ్వలా?'

"మోసం-దగా, ఆడు ఆళ్ళకుర్రాడే - అంతా మళయాళీలు - నక్సలైట్లు - మళయాళీలంతా నక్సలైట్లే - తెలుగోళ్ళని దోచుకోటానికొచ్చారు నా కొడుకులు - తన్నండి - కొట్టండి - "

ఇంక ఎవరేం చెప్పేదీ వినపడలేదు. దొమ్మిగా మాఁవయ్య మీద పడ్డారు పాతికమంది. కన్నయ్య బ్రాహ్మణ సోడాసీసా యెత్తాడు పెంటిని బుర్రమీద కొట్టడానికి. సుబాన్ అడ్డుపడ్డాడు. అతని తల పగిలింది. ఎవరో పెట్రోమేక్స్‌లైట్ విసిరారు అరుగుమీదికి. పగిలి పెద్దగా మంటలు లేచాయి – బూతప్ప పరుగెత్తబోయాడు. నలుగురతనిమీద పడ్డారు – వెండిసీసా పగిలిపోయింది. పావలా కాసులు చిందరవందరై పోయాయి. పెంటి పరుగెత్తికెళ్ళి బూతప్పని దగ్గరగా తీసుకుని దూరంగా వెళ్ళిపోయింది, చంటి బిడ్డతో. తాగిన చేతులు పావలాలకోసం తగవులాడాయి పిచ్చిగా. కిందపడిపోయిన మాఁవయ్యని చెయ్యిపట్టుకు లేవదీశా, కాలిపోతున్న పందిరికిందనించి.

నలుగురం జంక్షన్ పక్కని తూముమీద కూర్చున్నాం – కాదు ఐదుగురం చంటిపాపతో సహా. ఇల్లు నేలమట్టంగా కాలిపోయింది. మంటలు పూర్తిగా చల్లారేసరికి రైసు మిల్లు పెద్దగడియారం నాలుగు కొట్టింది.

మాఁవయ్య లేచాడు.

'రండి' అన్నాడు.

'యాడికి? యాడికిపోయినా బతకనివ్వరు మన్ని' అంది పెంటి.

'యాడో ఓ చోట బతకలేకపోం. భారతదేశం చాలా పెద్దది' అన్నాడు మాఁవయ్య. భుజంమీద చెయ్యేసి లేవదీసాడు పెంటిని. ఒకచేత్తో బిడ్డని, రెండో చేత్తో బూతప్పని పట్టుకుంది పెంటి. మావయ్య ఎడంచెయ్యి పెంటి భుజంమీద, రెండో చెయ్యి నా భుజంమీద.

ఒక్కక్షణం కొట్టు ఎదట నిలబడ్డాడు మాఁవయ్య. ఇరవైఏళ్ళ శ్రమ బూడిదైపోయింది. నిట్టూర్చి మళ్ళీ కదిలాడు.

కొత్తూరుపాలానికవతల, ఎక్కడో దూరంగా ఆకాశాన్ని చీలుస్తూ నల్లని అంచు, కొండో, మబ్బో, ఆపైని ఆకాశం తెల్లబడుతోంది. మరోరోజు రాబోతోంది. ●